

అందని ద్రాక్షే..!

ద్రాక్ష సాగుకు పూర్వవైభవం కలగానే మిగిలింది. ఉద్యానవనశాఖ అమలు చేయాలనుకున్న ప్రణాళిక ముందుకు సాగడం లేదు.

వివరాలు 8లో ▸



ఆది మానవుడి ఆనవాళ్లు

కొల్చారం మండలంలోని పాత శివాలయం గుట్ట మీద నవీన రాతియుగం ఆనవాళ్లు వెలుగు చూశాయి.

వివరాలు 8లో ▸



సిబ్బంది కొరత.. వసతుల లేమి!

నర్సాపూర్ ఫైర్‌స్టేషన్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాటు కనీస వసతులు కరువయ్యాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ విద్యాలయాల్లో చేరండి: కలెక్టర్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నడుస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థులను గురుకులాల్లో చేర్పించేందుకు ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చేరి ఉన్నత భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, రీజనల్ కోఆర్డినేటర్ గంగారాం నాయక్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రాయ్, కొడిపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఉపాధ్యాయుడు ఉదయ్ పాల్గొన్నారు.

12న కలెక్టరేట్‌లో యువజనోత్సవాలు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 12వ తేదీన కలెక్టరేట్‌లో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పీఆర్ డీఈఈగా శివప్రసాద్ బాధ్యతలు



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ డీఈఈగా శివప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన డీఈఈ శ్రీనివాస్ ఇటీవలే ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఖాళీ ఏర్పడింది. మేడ్చల్ జిల్లా జెడ్పీలో విధులు నిర్వర్తిస్తున్న శివప్రసాద్ అల్లాదుర్గం పీఆర్ డీఈఈగా బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

గర్భకోశ వ్యాధులతో జాగ్రత్త



రైతులకు ఉచిత మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటయ్య

పాపన్నపేట(మెదక్): పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య సూచించారు. గురువారం పాపన్నపేట మండల పరిధిలోని పొడ్చన్‌పల్లిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువులు ఎదకు వచ్చినప్పుడు గుర్తించే లక్షణాలు, సుడి కట్టేలా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. దూడల్లో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల లేగ దూడలు ఎదుగుతాయని తెలిపారు. ఆయన వెంట జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కార్యనిర్వాహణాధికారి డాక్టర్ రాంజీ, పాపన్నపేట మండల వైద్యాధికారి సౌమ్య, కొడపాక పశువైద్యాధికారి ప్రవీణ్, హవేళిఘణాపూర్ మండల పశువైద్యాధికారి సతీష్‌కుమార్ ఉన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు: ఎంవీఐ

మెదక్‌జోన్: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారని మెదక్ ఎంవీఐ విజయలక్ష్మి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహన డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినియోగదారుల భద్రతను నిర్ధారిస్తూ సురక్షితంగా వాహనాలు నడపాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు ధరించాలని సూచించారు.

ఆశల పల్లకిలో అంగన్‌వాడీ

- పోస్టుల భర్తీపై ప్రభుత్వం కసరత్తు
- జిల్లావ్యాప్తంగా 1,076 కేంద్రాలు
- 44 టీచర్.. 316 ఆయా పోస్టుల ఖాళీ

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఆరేళ్ల వయస్సు వరకు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించే ఈ కేంద్రాల్లో ఖాళీల కారణంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో త్వరలో పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించడంతో మహిళా నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి.

మెదక్‌జోన్: జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో మెదక్, రామాయంపేట, అల్లాదుర్గం, నర్సాపూర్ ఉన్నాయి. వీటి పరిధిలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 5,144 మంది గర్భిణులు, 4,639 మంది బాలింతలు, 53,558 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో 31,049 మంది 0 నుంచి మూడేళ్ల వయసు గల వారు కాగా, 22,409 మంది 3 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు ఉన్నారు. జిల్లాలో 885 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 191 మినీ కేంద్రాలు ఉన్నాయి. 2024 ఏప్రిల్‌లో మినీ కేంద్రాలను పూర్తిగా అప్‌గ్రేడ్ చేయడంతో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 1,076కు చేరింది. ఇంతవరకు బాగానే ఉన్నా చాలాకాలంగా వందలాది కేంద్రాల్లో ఖాళీలు వేధిస్తుండటంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మొత్తం 360 పోస్టుల ఖాళీలు

జిల్లాలో 1,076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ప్రతి కేంద్రంలో ఒక టీచర్, ఒక ఆయా ఉండాలి. కానీ జిల్లాలో 44 కేంద్రాల్లో టీచర్ పోస్టుల ఖాళీలు ఉండగా, 316 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లు లేని చోట చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందడం లేదు. ఆయాలు లేని కేంద్రాల్లో చిన్నారులకు సరైన పౌష్టి కాహారం అందడం లేదు. అయితే ఖాళీలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వాటికి దగ్గరలో ఉన్న కేంద్రాల సిబ్బందిని ఇన్‌చార్జిలుగా నియమించారు.



అందని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్

మూడు నెలలుగా జిల్లావ్యాప్తంగా 58 మంది అంగన్‌వాడీ సిబ్బంది రిటైర్‌మెంట్ అయ్యారు. వారికి అందాల్సిన బెనిఫిట్స్ నేటికీ అందలేదు. ఇందులో టీచర్లు 14 మంది, 44 మంది ఆయాలు రిటైర్‌మెంట్ అయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష చొప్పున ఇవ్వాల్సి ఉండగా, అవి నేటికీ అందకపోవడంతో నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



విద్యుత్ కాంతుల్లో వేంకటేశ్వరాలయం

‘ముక్కోటి’కి ముస్తాబు



ఆలయంలో కొలువైన స్వామివారు

- నేటి వైకుంఠ దర్శనాలకు సర్వం సిద్ధం
- దివ్వెల కాంతుల్లో వైష్ణవాలయాలు
- భారీగా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

మెదక్‌జోన్: ‘ముక్కోటి’కి వైష్ణవాలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. శుక్రవారం నిర్వహించే వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉత్తర ద్వారం నుంచి ఆయా దేవాలయాల్లోని దేవతామూర్తులను దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందని, అనేక పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అందుకు భక్తులు అధిక సంఖ్యలో వైష్ణవాలయాలకు తరలివస్తారు. జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇందుకోసం ఇక్కడ భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామి వారిని భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందించనున్నారు. దేవాలయాలు రంగురంగుల దీపాల వెలుగుల్లో కాంతులీనుతుండగా.. ఉత్తర ద్వారాన్ని తోరణాలతో అలంకరించారు.

అగ్నిప్రమాదం.. వాహనాలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నర్సాపూర్: ఆర్‌టీఏ అధికారులు పట్టుకున్న వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. వాహనాలను ఆర్‌టీసీ డిపో ఆవరణలోని ఖాళీ ప్రాంతంలో భద్రపరిచారు. కాగా గురువారం ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఆటోలు, ఒక కారు అగ్నికి ఆహుతయ్యాయి. వాహనాలు ఉన్న ప్రాంతంలో పొగ రావడంతో తాము వెళ్లి చూసేసరికి పలు వాహనాలకు నిప్పంటుకుని మంటలు వచ్చాయని, మంటలు ఆపేందుకు ప్రయత్నించడంతో పాటు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చామని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. కాగా తాము వచ్చే వరకు పలు వాహనాలకు నిప్పంటుకుందని ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ ఐలయ్య చెప్పారు. ఐదు వాహనాలు దగ్ధమయ్యాయని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పారాలీగల్ వాలంటీర్లుగా సేవలు అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆదాయం కోసం చూడకుండా స్వచ్ఛందంగా సేవలను అందించే మనస్తత్వం కలిగి ఉండాలన్నారు. కనీసం పదో తరగతి పాసై, రాయడం, చదవడం వచ్చి జిల్లా వాసులై ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఎంప్లాయీస్, సీనియర్ సిటి జన్స్, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘ కార్యకర్తలు తదితరులు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను జత చేసి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థలో ఈనెల 24వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



చైనా మాంజాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నాగరాజు హెచ్చరించారు. గురువారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి ఫతేనగర్ వీధిలో ఇద్దరు వ్యాపారుల రూ. 3,584 విలువ చేసే చైనా మాంజాను స్వాధీనం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదకరమని తెలిపారు. రోడ్డుపై వాహనదారుల మెడకు చుట్టుకొని చనిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తున్న, కలిగి ఉన్న వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ అమర్, ఏఎస్ఐ రుక్సానా తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలో వంద రోజుల పనిదినాలు పూర్తిచేసిన రైతులకు సేంద్రియ వ్యవసాయ విధానంపై నర్సాపూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రవికుమార్, భార్గవి అవగాహన కల్పించారు. గురువారం మండల ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ విధానంతో పాటు వర్మీ కంపోస్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్)/మెదక్‌జోన్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్నపేట మండలం చీకోడు, లింగాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాలను సందర్శించారు. ముందుగా విద్యార్థుల భోజనశాల, స్టోర్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. మెను అమలు తీరుపై హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలతో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే మెను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట చీకోడ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మెదక్ టీజీఎస్‌డబ్ల్యూఏఆర్ఎస్ (వెలుగు) పాఠశాలకు చెందిన విద్యార్థిని సంజన తయారు చేసిన బహుళ ప్రయోజక చేతికర్ర జాతీయస్థాయికి ఎంపికైనట్లు డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థిని అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మరో మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఇదేస్ఫూర్తితో జాతీయస్థాయిలో దక్షిణ భారత స్థాయిలో రాణించి జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

‘సేవ్ లైఫ్’ సేవలు అభినందనీయం

డీఎస్పీ వెంకట్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తూప్రాన్: రహదారిపై ప్రమాదాల నివారణ కోసం ‘సేవ్ లైఫ్ ఫౌండేషన్’ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం తూప్రాన్ డివిజన్ పరిధి పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 44వ జాతీయ రహదారిని సేవ్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు దత్తత తీసుకున్నట్లు తెలిపారు. అతివేగంగా ప్రయాణించే వాహనాలపై ఆటోమెటిక్ ఛానల్ జనరేట్ అయ్యే విధంగా ఎన్‌పీఆర్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే రహదారిపై మరమ్మతులు గుర్తించి వెంటనే పనులు చేపడుతారని చెప్పారు. కాగా ప్రమాదాలు చోటు చేసుకున్న వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స, సురక్షితంగా తరలించే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు శివానందం, సుభాష్‌గౌడ్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కార్యాలయ పరిధిలోని పోలీస్‌గ్రౌండ్‌లో గత రెండు రోజులుగా కొనసాగిన జిల్లాస్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. పోటీల్లో డీఏఆర్‌జట్టు, మెదక్ డివిజన్ జట్టు, తూప్రాన్ డివిజన్ జట్టు పాల్గొన్నట్లు చెప్పారు. బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, తగ్గఫ్‌వార్, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ఫీడ్‌బ్యాక్ సేకరణ

పోలీసుల పనితీరు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు అన్ని పోలీస్‌స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీస్‌శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లను గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. అంతకుముందు డీజీపీ జితేందర్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్లను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పెరిగిన పంటల రుణస్థాయి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రానున్న ఆర్థిక ఏడాది 2025–26లో పంట రుణాలకు సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను సుమారు 10 నుంచి 12 శాతం వరకు పెంచాలని జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సూత్రప్రాయంగా నిర్ణయించింది. వరికి ఇచ్చే పంట రుణాన్ని ఎకరానికి రూ. ఏడు వేల చొప్పున పెంచనున్నారు. ఇప్పటివరకు నీటి పారుదల సౌకర్యం ఉన్న భూముల్లో సాగు చేసే వరి పంట ఎకరాకు రూ.43 వేల నుంచి రూ.45 వేల చొప్పున బ్యాంకులు రుణాలిచ్చేవి. ఇకపై ఈ పంటకు కనీసం రూ.49 నుంచి రూ.52 వేలకు పెంచాలనే డీఎల్‌టీసీ నిర్ణయించింది. మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలో అన్ని పంటల కంటే వరి ఎక్కువగా సాగవుతుంది. ఈ రెండు జిల్లాలతో పోల్చితే సంగారెడ్డిలో వరి కాస్త తక్కువ విస్తీర్ణంలో వేసుకుంటారు. ఆయా పంటల సాగుకు ఎకరాకు అయ్యే ఖర్చులు, ఎకరానికి వచ్చే సగటు దిగుబడులు, రైతు సొంత అవసరాలకు పోగా విక్రయించే పంట పరిమాణం తదితర అంశాలను లెక్కించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయిస్తారు.

పల్లెల్లో పంచాయతీ సందడి

- పట్టుకోసం ప్రధాన పార్టీల ఆరాటం
- ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- ప్రజలను మచ్చిక చేసుకునే పనిలో బిజీ



టేక్మాల్(మెదక్): గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. గతేడాది జనవరిలోనే పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించడంతో ఆశావహులు ప్రజలను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా.? ఎప్పుడు రిజర్వేషన్లు ప్రకటిస్తారా.? అని ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయనే నమ్మకంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. తమ గ్రామాలకు ఏ రిజర్వేషన్లు రావచ్చు అని తమకు తెలిసిన అధికారుల వద్ద ఆరా తీస్తున్నారు. అయితే గత పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లనే ఈసారి వర్తింపజేస్తారనే ఆశాభావంతో పలువురు ఉన్నారు. ప్రభుత్వం తాజాగా కులగణన చేపట్టిన నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశాలున్నాయని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు.

సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్!

సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ఇటీవల ప్రకటన చేయడంతో ఆశావహులు నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నేతల్లో ఉత్సాహం పెరిగింది. గ్రామాల్లో సైతం కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు రెడీ అవుతున్నాయి. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్ వచ్చే అవకాశాలున్నాయని గ్రామాల్లో జోరుగా చర్చ కొనసాగుతోంది.

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: సిద్దిపేట ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12,13,14వ తేదీల్లో నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్‌ను గురువారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆవిష్కరించారు. అనంతరం సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ అక్బర్ నవాబ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌లో దాదాపు పాఠశాలల నుంచి 20 జట్లు పాల్గొననున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ హరీశ్, జాయింట్ సెక్రటరీ సాజిద్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తుజాల్‌పూర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్ల యాదగిరి (52) పౌల్ట్రీ ఫారమ్ షెడ్ నిర్మాణం కోసం చేసిన అప్పులతోపాటు తండ్రి పేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద చేయలేదని మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గృహిణి అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): గృహిణి అదృశ్యమైన ఘటన మండల పరిధి దొంతి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన జంగం కుమార్‌కు రెండేళ్ల కిందట సావిత్రీతో రెండో వివాహం జరిగింది. 8న ఏదైనా పరిశ్రమలో పని చూసుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోడంతో భర్త కుమార్‌కి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం భర్త ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు



ఆరీఫ్‌ఖాన్‌ను చూపుతున్న పోలీసులు

జహీరాబాద్ టౌన్: ఐదేళ్ల నుంచి తప్పించుకొని తిరుగుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్టు చేసి గురువారం కోర్టులో రిమాండ్ చేశామని ఎక్సైజ్ ఎస్ఐ రమేశ్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర థార్ జిల్లాకు చెందిన ఆరీఫ్ ఖాన్ అక్రమంగా మద్యం రవాణా చేస్తుంటాడని, ఇతడిపై హైదరాబాద్‌లోని చేవెళ్ల, శంషాబాద్, కుత్బుల్లాపూర్ తదితర స్టేషన్‌లలో కేసులు ఉన్నాయన్నారు. 2016 సంవత్సరంలో 4 లోడ్ల ఎన్‌డీపీఎల్ మద్యాన్ని రాష్ట్రానికి తీసుకొస్తుండగా ఆయనపై పీడీ యాక్టు నమోదు చేయడం జరిగిందన్నారు. 2014–15 సంవత్సరంలో ఇతడిపై జహీరాబాద్‌లో కూడా కేసు నమోదైందన్నారు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతూ గోవాలో ఉన్నట్లు సమాచారం మేరకు అక్కడి వెళ్లి ఆరీఫ్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు జహీరాబాద్ కోర్టులో రిమాండ్ చేశామని ఆయన వివరించారు.

మందుబాబులకు జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆరుగురికి కోర్టు జైలు, జరిమానా విధించిన ఘటన ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలిసి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద బుధవారం అర్ధరాత్రి ప్రత్యేక తనిఖీ నిర్వహించాం. మద్యం సేవించి వాహనం నడుపుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒక్కరికి రెండు రోజులు జైలు శిక్ష, మిగితా ముగ్గురికి రూ.1500, మిగితా ఇద్దరికి రూ.1,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అందని ద్రాక్షే..!



కనుమరుగైన సాగు
- గతంలో హబ్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా
- ప్రభుత్వ సహకారం కొరవడి ఛిన్నమైన పరిస్థితులు
- స్థానిక అవసరాలకు పొరుగు రాష్ట్రాల సరుకే దిక్కు
- సాగు పెంపు కార్యాచరణ ముందుకు సాగకపోవడం వల్లే ఈ దుస్థితి



గజ్వేల్ ప్రాంతంలో ద్రాక్ష సాగు (ఫైల్)

ద్రాక్ష సాగుకు పూర్వవైభవం కలగానే మిగిలింది. రాష్ట్రంలో ఒకప్పుడు ద్రాక్షకు హబ్‌గా ఉన్న ఉమ్మడి మెదక్‌తోపాటు పలు జిల్లాల్లో రైతులను ప్రోత్సహించేందుకు ఉద్యానవనశాఖ రెండేళ్ల కిందట అమలు చేయాలనుకున్న ప్రణాళిక ముందుకు సాగడం లేదు. ఫలితంగా సాగు కనుమరుగై స్థానిక అవసరాలకు పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ వ్యవహారంపై కథనం..

గజ్వేల్: తెలంగాణలో ద్రాక్ష సాగుకు సంబంధించి ఒకప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు హబ్‌గా ఉండేవి. ఆయా జిల్లాల్లో మొత్తంగా ఏటా 50 వేల ఎకరాలకుపైగా తోటలు సాగులోకి వచ్చేవి. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం ద్రాక్ష సాగులో సింహభాగాన్ని ఆక్రమించేది. విదేశాలకు ఎగుమతి చేసేందుకు దోహదపడే సీడ్‌లెస్ థామ్సన్, తాజ్ గణేశ్ రకాలే ఇక్కడి రైతులు ప్రధానంగా సాగు చేసేవారు. విదేశాలకే కాకుండా ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా ద్రాక్ష ఎగుమతయ్యేది. కానీ పెట్టుబడుల భారం, తెగుళ్లతో జరిగే భారీ నష్టాల కారణంగా తీవ్రంగా నష్టాలు చవిచూడటంతో పాటు ప్రభుత్వ సహకారం కూడా కరువై రైతులంతా ఈ తోటల సాగుకు దూరమయ్యారు. ఫలితంగా సాగు పూర్తిగా కనుమరుగైంది.

మహారాష్ట్ర సరుకే దిక్కు..

ప్రస్తుతం మన రాష్ట్ర అవసరాలకు మహారాష్ట్ర నుంచి ద్రాక్షను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అక్కడ జనవరి మొదటి వారం నుండి తోటలు కోతకు వస్తుంటాయి. తెలంగాణ జిల్లాల్లో ఫిబ్రవరి చివరి వారంలో తోటలు కోతకు వస్తాయి. కానీ సాగు లేని కారణంగా మహారాష్ట్ర సరుకుపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఇక్కడ అడపాదడపా థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు సాగుచేసినా అవి గోళీల మాదిరిగా గుండ్రంగా ఉంటాయి. కానీ మహారాష్ట్రలో సూపర్ సొనాక, మానిక్‌చమన్ లాంటి రకాలు చిటికిన వేలు ఆకారంలో ఉండి మార్కెట్‌లో వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటి దెబ్బకు ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న కొద్దిపాటి సరుకును కూడా కొనేవారు లేకుండా పోయారు.

ముందుకుసాగని కార్యాచరణ

ఒకప్పుడు ద్రాక్ష సాగుకు సంబంధించి హబ్‌గా వర్ధిల్లిన ఉమ్మడి మెదక్‌తోపాటు ఇతర జిల్లాల్లోనూ కనుమరుగయ్యే పరిస్థితి రావడంతో ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యానవన శాఖ, ములుగులోని కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్శిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ అమలుచేయడానికి నిర్ణయించారు. ఈ క్రమంలోనే అప్పట్లో ములుగు యూనివర్శిటీ పరిధిలోని రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాలలో మేధోమథన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాగుపై తగ్గడానికి గల కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. హైదరాబాద్‌కు సమీపంలోని ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని భూములన్నీ రియల్ వ్యాపారం కారణంగా బడా బాబులు చేతులకు వెళ్లిపోవడం, ద్రాక్ష సాగుకు కూలీలు సమస్యగా మారటం, పెట్టుబడి లక్షల్లో ఉండటం, ఎరువులు, క్రిమిసంహారకాల నిర్వహణ కష్టతరంగా మారటం వంటి కారణాల వల్ల సాగు పడిపోయి... ప్రస్తుతం కనుమరగయ్యే పరిస్థితి వచ్చిందని గుర్తించారు. తెలంగాణలో వేలాది ఎకరాల్లో సాగు రాష్ట్రం మొత్తంగా చూస్తే కేవలం కొద్ది ఎకరాల్లోనే ఉన్నదని కూడా నిర్ధారించారు. ఈ క్రమంలోనే ఏటా కనీసం వెయ్యి ఎకరాలు కొత్తగా ద్రాక్ష సాగు పెరిగేలా ఏం చేయాలనే అంశంపైన కూడా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం ద్రాక్షలో టేబుల్, జ్యూసీ, వైన్ అనే మూడు రకాలుంటాయి. ఇందులో ఒక్కో వెరైటీలో ఎన్నో కొత్త వంగడాలు వచ్చాయి. ఈ రకాలపై రైతులకు అవగాహన కల్పించి ఈ నేలలకు అనుకూలమైన రకాలను ఎంచుకొని సాగు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు.

ఎన్నో కొత్త వంగడాలు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నారాయణఖేడ్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం కథనం మేరకు.. గ్రామానికి చెందిన మేత్రి ఉమాకాంత్ (29) కొన్నేళ్లుగా మతిస్థిమితం సక్రమంగా లేక రోడ్ల వెంట తిరిగేవాడు. గురువారం గ్రామ సమీపంలోని బావిలో మృతదేహమై కనిపించడంతో స్థానికులు గుర్తించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడా లేదా దూకాడా అనే దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

పుల్‌కల్(అందోల్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్ కథనం మేరకు.. మినుపూర్ తండాకు చెందిన బానోత్ ప్రకాశ్ (38) 6న పుల్‌కల్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ముదిమాణిక్యం చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న ఎంఎస్‌ఆర్ స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బానోత్ ప్రకాశ్‌ను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సంగ్యానాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడు..



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని కానుకుంట వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని కానుకుంట షాబాద్ హోటల్ సమీపంలో ఓ వృద్ధుడు పడిపోయి ఉన్నట్లు డయల్ 100కు ఫోన్ వచ్చింది. స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఆ వృద్ధుడిని వెంటనే పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సుమారు 55 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతిని ఒంటిపై నీలి రంగు షర్టు, నీలి రంగు లుంగి ధరించి ఉన్నాడు. మృతిని విషయంలో చుట్టు పక్కల ఆరా తీయగా మృతుడు కానుకుంటలోని హనుమాన్ ఆలయం వద్ద భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు

ప్రజావేదికలో అధికారుల వెల్లడి



ప్రజా వేదికలో అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీలో రూ.లక్షల్లో అక్రమాలు జరిగినట్లు ప్రజావేదికలో అధికారులు తేల్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 23 గ్రామ పంచాయతీలకు గాను 2023–2024 16వ వార్షిక ఏడాదికి సంబంధించి రూ.9.60 కోట్ల పనులపై తనిఖీలు నిర్వహించారు. పని వివరాలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పని ప్రదేశంలోనే పని వివరాలను నేమ్ బోర్డు పై పొందుపర్చి ఏర్పాటు చేయాలి. కానీ ఆవేవి పట్టన్నట్లు అధికారులు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకుండానే సుమారుగా రూ.4,55,000 చెల్లింపులు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తొమ్మిది గ్రామాల్లో నేమ్ బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని జరగకపోయినా జరిగినట్లు రికార్డులో నమోదు చేసుకొని మస్టర్‌లో సంతకాలు లేకుండానే నగదు చెల్లింపులు చేసుకున్నారు. తక్కువ పనికి ఎక్కువ చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. కూలీలకు పే స్లిప్‌లు అందికపోవడం, ఏడు రకాల రిజిష్టర్లను నిర్వహించకపోవడం ఒకే కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేగా రెండు బాజ్‌కార్డులు ఇచ్చారని ప్రజావేదికలో వీఆర్పీలు వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటూ రికవరీకి ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో బాలకృష్ణ, ఏపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో రామ్మోహన్, క్యూసీ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మా అమ్మ మృతిపై అనుమానాలు

- చికిత్స సమయంలోనే మరణం
- కానీ.. డబ్బులు తీసుకునేదాకా వ్యవహారాన్ని దాచారు
- కూతురు ఫిర్యాదు.. మృతదేహానికి రీ పోస్టుమార్టం



పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు, తహసీల్దార్

రామాయంపేట(మెదక్): తన తల్లి మృతిపై అనుమానం ఉందంటూ ఓ మహిళ హైదరాబాద్‌లో ఫిర్యాదు చేయగా గురువారం మండలంలోని సుతారిపల్లిలో వైద్యులు రీ పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సుతారిపల్లికి చెందిన రాగి చిన్నవాలోల్ల లక్ష్మి (45) నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో మృతి చెందగా, పోస్టు మార్టం నిర్వహించకుండానే గ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. తన తల్లికి చికిత్స చేస్తున్న క్రమంలో మృతి చెందగా, వైద్యులు తనకు సమాచారం ఇవ్వకుండా డబ్బులు తీసుకున్న తర్వాతే మృతి చెందినట్లు చెప్పారని కూతురు ఆరోపించింది. హైదరాబాద్‌లో ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసీల్దార్ రజనీకుమారి సమక్ష్యంలో గాంధీ ఆస్పత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

రేవంత్‌రెడ్డిది డైవర్షన్ పాలిటిక్స్

- ఫార్ములా ఈ రేస్‌పై కేటీఆర్ ప్రవర్తన విచిత్రంగా ఉంది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి డ్రామా రక్తి కట్టిస్తున్నాయి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న అమర్నాథ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా కేవలం టైం పాస్ డైవర్షన్ పాలిటిక్స్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్నాథ్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా చేసిన కాళేశ్వరం, హెచ్ఎండీఎస్, ఫోన్ ట్యాపింగ్, జీఎస్టీ, ఫార్ములా ఈ రేసింగ్ తదితర స్కామ్‌లను సమయానుకూలంగా తెరపైకి తీసుకొచ్చి, కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచినట్లు మర్చిపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కొట్టినట్లు చేస్తుంది, బీఆర్ఎస్ ఏడ్చినట్లు చేస్తుందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే అని ఆరోపించారు. ఇంతవరకు ఒక్క స్కామ్ గురించి పూర్తి స్థాయిలో విచారణ చేయకపోవడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రవర్తన విచిత్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ సహకరించినా, బీజేపీ మాత్రం అన్ని స్కామ్‌లపై నిలదీస్తుందన్నారు. పంట సాగు ప్రారంభించకముందే పెట్టుబడి సహాయం అందించాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో 484 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, తమ పేరుపై మార్చుకున్నారని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విద్యా సాగర్, విభీషన్ రెడ్డి, గోనె మార్కండేయులు, కుడిక్యాల రాములు, రమేశ్ గౌడ్, ప్రసాద్, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి సిద్దిపేట ప్రాజెక్ట్



క్లీనింగ్ డివైస్ ప్రాజెక్ట్ విద్యార్థి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనలో జిల్లాకు చెందిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికై ందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన 52వ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనలకు జిల్లా నుంచి 18 ఇన్‌స్పైర్ , 14 సైన్స్ ఫెయిర్, ఒకటి టీచర్ ఎగ్జిబిట్‌లు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇన్‌స్పైర్ మానక్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అహ్మదీపూర్ కు చెందిన విద్యార్థి వికాస్, గైడ్ టీచర్ హఫీజ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఫోర్ టేబుల్ మ్యాట్రిస్ క్లీనింగ్ డివైస్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికై ందన్నారు. త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనలో వికాస్ ప్రాజెక్టు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయిని, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వికాస్‌కు ప్రశంసాపత్రాలు అందించారన్నారు.

కొండపాక గురుకుల ఘటనపై జడ్జి ఆరా

- ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్‌పై ఆగ్రహం
- వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామని వెల్లడి



దెబ్బలను జడ్జి స్వాతిరెడ్డికి చూపుతున్న విద్యార్థి

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని దుద్దెడలో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను గురువారం సిద్దిపేట జిల్లా స్వాతిరెడ్డి సందర్శించారు. విద్యార్థుల పరిస్థితులను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) వాసు ప్రవర్తన, గురుకుల పాఠశాల నిర్వహణ , ప్రిన్సిపాల్ పర్యవేక్షణ తీరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటి మాటికి ఏదో సాకుతో ఫిజికల్ డైరెక్టర్ చితక బాదుతాడంటూ ఇలాంటి పీడీ మాకొద్దంటూ విద్యార్థులు జడ్జితో మొరపెట్టుకున్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానాల రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ విద్యార్థులు జడ్జి దృష్టికి తీసుకెళ్తూ కన్నీరు పెట్టారు. హాస్టల్ పరిసరాలను, మధ్యాహ్న భోజన తీరులను పరిశీలించారు. ఫిజికల్ డైరెక్టర్ నిర్వహణ తీరులపై విద్యార్థులతో లిఖిత పూర్వక ఫిర్యాదును స్వీకరించారు. ఈ సందర్భంగా జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. ఘటనపై సేకరించిన వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలంటూ ప్రిన్సిపాల్‌ను మందలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి



శిఖం భూమిని గుర్తిస్తున్న అధికారులు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి హెచ్చరించారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి గ్రామ శివారులో గల ధర్మారెడ్డి చెరువు శిఖం సర్వే నంబరు 402లో అన్యాక్రాంతమైన 1.20 ఎకరాల భూమిని గురువారం రెవెన్యూ అధికారులు గుర్తించి హద్దులు పాతారు. ఇటీవల చెరువు శిఖం భూమి అన్యాక్రాంతమైందన్న విషయాన్ని గ్రామస్తులు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి నివేదికను సమర్పించాలన్న కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డితోపాటు ఆర్ఐ సత్యనారాయణ చెరువు శిఖం భూమిని సర్వే చేసి హద్దులు పెట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఆక్రమించడం నేరమన్నారు. ఆక్రమణకు గురైన విచారణ నివేదికను కలెక్టర్ కార్యాలయంలో అప్పగిస్తామన్నారు.


పోలీసు సేవలపై ప్రజల అభిప్రాయం

క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ

సిద్దిపేటకమాన్: ఫిర్యాదుదారులకు అందుతున్న పో లీసు సేవలపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించినట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదుదారుల ఫీడ్ బ్యాక్ సేకరణ జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారులు పోలీసు స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇచ్చిన తర్వాత వారికి అందుతున్న సేవల గురించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని చెప్పొచ్చన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, ఏసీపీ కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోలీసులు స్పందించిన తీరు, ఇతర విషయాల గురించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తెలుపొచ్చన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్, కిరణ్, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, పీఆర్ఓ మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆది మానవుడి ఆనవాళ్లు గుర్తింపు





జంతువులను వేటాడడానికి ఉపయోగించిన రాతి పనిముట్టు, పాత శివాలయం గుట్ట

అంసాన్‌పల్లి పాత శివాలయం గుట్ట వద్ద లభ్యం

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామ శివారులోని పాత శివాలయం గుట్ట మీద నవీన రాతియుగం ఆనవాళ్లు వెలుగు చూశాయి. ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు లైబ్రేరియన్ బుర్ర సంతోష్ గురువారం సాక్షితో తన పరిశోధనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆనాటి ఆది మానవులు ఆహార వేటలో భాగంగా ఉపయోగించిన రాతి పనిముట్లు, పదును చేయడానికి నూర్చిన నూరుడు గుంతలు (గ్రూమ్స్) గుర్తించినట్లు తెలిపారు. క్రీస్తు పూర్వం 5 వేల సంవత్సరం కిందట ఆది మానవులు ఇక్కడ నివసించినట్లు ఈ ఆధారాల ద్వారా తెలుస్తుందన్నారు. ఇది వరకే కాజీపల్లి ఉడుము గుట్టలు, జక్కన్నపేట నల్లగుట్ట కుక్కునూరు బండలు, హస్తల్‌పూర్ గుట్టలలో పురాతన మానవుడి ఆనవాళ్లు, అప్పటి ఆదిమానవుల రాతి పెయింటింగ్స్ గుర్తించామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా!

- పట్టపగలే ట్రాక్టర్లలో తరలింపు
- అక్రమార్కులకు కాసుల పంట
- నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్న అధికారులు



పట్టపగలే ట్రాక్టర్లలో ఇసుక రవాణా

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సరిహద్దు మండలాలైన బెజ్జంకి, కోహెడ, ఇల్లంతకుంట మండలాల నుంచి వ్యాపారులు ఇసుకను చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాలతోపాటు సిద్దిపేట పట్టణానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నిత్యం వ్యాపారులకు ఇసుక దందా కాసుల వర్షం కురిపిస్తుంది. చట్టం ప్రకారం వాహనాలను జప్తు చేయడంతో పాటు జరిమానా విధించాలి. కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసే నాథుడు కరువయ్యారు. ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులు వాహనానికి ఇంతా అంటూ మామూళ్లు దండుకుంటున్నారు. అధికారుల హోదాలకు అనుగుణంగా ఇసుక వ్యాపారులు జేబులను తడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తెరచాటు దందాలో కొందరు నాయకులు శక్తి మేర అండదండలు అందిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారంలో కొందరు రాటుదేలి ఈ వ్యాపారాన్ని ఉపాధిగా చేసుకొని దర్జాగా సాగిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు తనిఖీలు చేసి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకొని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.